క్లుప్తంగా

భరద్వాజ్‌కు అభినందన



భరద్వాజ్‌ను అభినందిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన పేడాడ భరద్వాజ్‌ను మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం, వాణిశ్రీ దంపతులు మంగళవారం తమ గృహంలో అభినందించారు. ఇటీవల ప్రకటించిన నీట్ ప్రవేశ పరీక్షలో భరద్వాజ్ సత్తాచాటారు. వైద్య విద్యకు ఎంపిక కావడంతో తమ్మినేని ఇంటికి కుమారుడిని విద్యార్థి తండ్రి, వైఎస్సార్‌సీపీ కార్యకర్త వెంకటరమణ (ముద్దు) తీసుకువెళ్లారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మిమ్స్ కళాశాలలో ఫ్రీ సీటు లభించినట్లు తమ్మినేనికి భరద్వాజ్ తండ్రి తెలియజేశారు. మరిన్ని విజయాలు సాధించాలని తమ్మినేని సీతారాం, వాణిశ్రీ దంపతులు ఆకాంక్షించారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ



విద్యార్థులకు గొడుగులు, బాటిళ్లు అందజేస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం

సారవకోట: మండలంలోని కిడిమి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న రావాడ యోగేశ్వరరావు విద్యార్థులకు గొడుగులు, వాటర్ బాటిళ్లు మంగళవారం పంపిణీ చేశారు. తన కుమార్తె జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. హెచ్‌ఎం మాధవి, సర్పంచ్ రొక్కం చిరంజీవి, ఎస్‌ఎంసీ చైర్మన్ రొక్కం సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసాను ఆదర్శంగా తీసుకోవాలి



థెరీసా చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

జలుమూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో మదర్ థెరీసా జయంతిని మంగళవారం నిర్వహించారు. థెరీసాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓలు బి.మాధవరావు, ఎం.వి.ఆర్ ప్రసాదరావు అన్నారు. థెరీసా దేశానికి గొప్ప సేవలు చేసి ఖ్యాతి పొందారన్నారు. థెరీసా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. హెచ్‌ఎం ఇప్పిలి మాధవరావు, ఉపాధ్యాయులు మెండ రామారావు, జి.ప్రసాదరావు, బి.సతీష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న జిల్లా విజిలెన్స్ అధికారి లవరాజు

సారవకోట: ఈ నెలాఖరు నుంచి జరగనున్న సామాజిక తనిఖీలు పక్కాగా నిర్వహించాలని ఉపాధి హామీ పథకం జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు సూచించారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 17వ విడత సామాజిక తనిఖీలకు తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో వేతనదారులతో మాట్లాడి సమాచారం సేకరిస్తారన్నారు. రూ.19,98,03,806 వేతనాలు, రూ.8,46,34,484 మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించి సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏపీఓ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.టి.చౌదరి, జె.కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎస్.రాజా, సభ్యులు, సత్యసాయి ఆర్గనైజర్ కరకవలస ప్రహ్లాదరావు, తదితరులు పాల్గొన్నారు.



బూర్జ: వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న అయ్యవారిపేట యువకులు



కొత్తూరు: కొత్తూరు మార్కెట్‌లో వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



నరసన్నపేట: విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు

తొలిపూజకు సర్వం సిద్ధం

- వినాయక ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- గ్రామాలకు తరలిన విగ్రహాలు

ఆది దేవుడు గణపతి పూజకు అంతా సిద్ధమైంది. బుధవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు వాడవాడల్లో మండపాలను సుందరంగా అలంకరించారు. పూజకు కావాల్సిన సామగ్రిని సమకూర్చుకున్నారు. పూజా సామగ్రి, పండ్ల ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొనుగోలుదారులతో మార్కెట్లు మంగళవారం కిక్కిరిశాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలకు గణనాథులను వాహనాలపై తరలించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



కొత్తవీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం

సినీ సెట్టింగ్‌లతో..

నరసన్నపేట: వినాయ చవితి వచ్చిందంటే మండపాల ఏర్పాటుకు కమిటీ ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ప్రత్యేక అలంకరణతో మండపాలను తీర్చిదిద్దుతారు. నరసన్నపేట కొత్తవీధిలోని వినాయక మండపం ప్రతి ఏటా ప్రత్యేక సంతరించుకుంటుంది. ఈ సారి కూడా సినీ సెట్టింగ్‌లతో మండపాన్ని సిద్ధం చేశారు. విశ్రాంత ఆర్డీఓ పి.ఎర్రయ్య స్వయంగా మండప ఏర్పాట్లను పర్యవేక్షించారు. సినీ నటుడు ప్రభాస్ శ్రీను ఈ ఉత్సవాల్లో పాల్గొనున్నారు.

అనుమతులు తప్పనిసరి

వినాయ నవరాత్రులు చేస్తున్నవారు విధిగా అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా ఉత్సవాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. సింగల్ విండో పద్ధతిలో అనుమతులు ఇస్తున్నాం. ఇతరులకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా ఉత్సవాలు నిర్వహించాలి. కమిటీ ప్రతినిధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎం. శ్రీనివాసరావు, సీఐ, నరసన్నపేట



పాతపట్నం: అంతరాబ కూడలి వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం



హిరమండలం: హిరమండలం మార్కెట్‌లో వినాయక ప్రతిమలు కొనుగోలు భక్తులు



నరసన్నపేట: జోరు వర్షంలోనూ పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



కొత్తూరు: క్రేన్ సాయంతో వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న నిర్వాహకులు



పాతపట్నం: ట్రాక్టర్‌పై వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న బూరగాం యువకులు



కొత్తూరు: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్



కొత్తూరు: కొత్తూరు మార్కెట్‌లో పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



పాతపట్నం: మార్కెట్‌లో పండ్లు, పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



హిరమండలం: ఎల్.ఎన్.పేటలో వాహనంపై వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు

ముంచెత్తిన వాన



నరసన్నపేట: లక్ష్మీ నగర్‌లో చేరిన వర్షం నీరు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన పంట పొలాలు

నరసన్నపేట: అల్పపీడన ప్రభావంతో సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లు కాలువలను తలపించాయి. మంగళవారం ఉదయానికి నరసన్నపేటలో 5 సెంటీ మీటర్లు వర్షపాతం నమోదైంది. పట్టణంలోని వీధులు, సమీపంలోని పంట పొలాలు నీటితో నిండాయి. మడపాం, గొట్టిపల్లిలో వరి పంట నీట మునిగింది. గుండవల్లిపేట వద్ద సర్వీసు రోడ్డులో నీరు చేరింది. వాహన దారులు ఇబ్బంది పడ్డారు. గొట్టిపల్లి ఫ్లై ఓవర్ కింద వర్షంనీరు అధికంగా చేరింది. వాహనాల రాకపోకలు స్తంభించాయి. గొట్టిపల్లి మీదుగా వెళ్లే 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి ఆనుకొని ఉన్న మారుతీనగర్, లక్ష్మీనగర్‌ల్లో రెండు అడుగులకు పైగా నీరు నిలిచింది. పట్టణంలోని శివనగర కాలనీ, కలివరపుపేట, మఠం వీధి, బజారు వీధి, పుండరీకాక్ష కాలనీ, నాయడు వీధి, భవానీపురం, శ్రీరామనగర్, కలాసీ కాలనీల్లో అధికంగా నీరు చేరింది.

వంతెన పైనుంచి..

సారవకోట: మండలంలో రెండురోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువులు నీటితో నిండాయి. చీడిపూడిలో వంశధార కాలువ వంతెన పైనుంచి వరదనీరు అధికంగా ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

భారీ వర్షాలతో ఇక్కట్లు

ఆమదాలవలస: పట్టణం, మండలంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆమదాలవలస-పాలకొండ రహదారిపై ఓవర్ బ్రిడ్జి జంక్షన్ వద్ద వరదనీరు పారింది. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణం చెరువును తలపిస్తోంది. పొన్నాంపేటలో మంగి సీతమ్మకు చెందిన పూరిల్లు, పాట్నూరు సావిత్రమ్మకు చెదిన పూరింటికి మధ్యలో మట్టి గోడ కూలి ఇంటి పైకప్పు పడింది. ఆ సమయంలో వారు బయట ఉండడంతో ప్రమాదం తప్పింది.



కొత్తూరు: మాకవరం వద్ద నీట మునిగిన వరి పొలం



బూర్జ: రోడ్డు పైనుంచి ప్రవహిస్తున్న పాతకర్ర చెరువు నీరు

రోడ్డుపై వరద నీరు ప్రవాహం

బూర్జ: మండలంలో గత రెండు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు అయ్యవారిపేటకు చెందిన పాత కర్ర చెరువు నిండింది. రోడ్డు పైనుంచి గ్రామంలోకి వరదనీరు ప్రవహిస్తోంది. రోడ్డు గోతులమయంగా తయారైంది.



సారవకోట: చీడిపూడి సమీపంలోని వంశధార కాలువ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



ఆమదాలవలస: చెరువును తలపిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణం



ఆమదాలవలస: పట్టణ శివారులోని పాలకొండ-ఆమదాలవలస రహదారిపై పారుతున్న వర్షం నీరు

పొంగిపొర్లిన చెరువులు, గెడ్డలు..

కొత్తూరు: మండలంలోని కారిగెడ్డ, ఇసుక గెడ్డ, తంపరగెడ్డ, హడ్డుబంగి గెడ్డ, బలిజవాని గెడ్డతోపాటు పలు చెరువులు, సాగునీటి వనరులు పొంగిపొర్లాయి. కారిగెడ్డకు వరద నీరు ఉధృతంగా రావడంతో మండలంలోని వీఎన్‌పురం, మాకవరం గ్రామల వద్ద తంపర పొలాలు నీటమునిగాయి. వరి చేను కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుసిన భారీ వర్షాలకు నీటి మునిగిన పంట పొలాలు తేరుకోక ముందే మరోసారి నీట మునగడంతో పంటకు నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



నరసన్నపేట: గొట్టిపల్లి వద్ద సర్వీసు రోడ్డుపై నిలిచిన నీరు



నరసన్నపేట: కలివరపు పేటలో వర్షం నీరు



నరసన్నపేట: మార్కెట్‌కమిటీ వద్ద నీట మునిగిన పొలాలు

జలకళ



నిండుకుండలా ఉన్న కృష్ణసాగరం

జలుమూరు: మండల పరిధిలోని కరవంజ–గుగ్గిలి గ్రామాల మధ్య ఉన్న కృష్ణసాగరం నీటితో కళకళలాడుతోంది. సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షాలతోపాటు ఎగువ ప్రాంతంలోని వంశధార కాలువ నుంచి వచ్చిన నీటితో నిండింది. సుమారు 200 ఎకరాల విస్తీరణం గల ఈ సాగరం జలుమూరుతోపాటు నరసన్నపేట మండలాలకు 3ఆర్ మేజర్ నడగాం కాలువ ద్వారా (నాలుగు వేల ఎకరాలకు) సాగునీరు అందిస్తోంది. ప్రస్తుతం నిండుకుండులా ఉండడంతో దిగువ ప్రాంతానికి నీరు ప్రవహించడంతో మత్స్యకారులు చేపలు పట్టి ఉపాధి పొందుతున్నారు.

కూటమి పాలన మోసాలమయం



పెద్దసున్నాపురంలో కూటమి వైఫల్యాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. మండలంలోని పెద్దసున్నాపురం, పూతికగూడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను ఇంటింటికీ వెళ్లి అందించారు. పలువురు మహిళలు రెడ్డి శాంతి దృష్టికి సమస్యలను తీసుకువచ్చారు. మళ్లీ జగనన్నే రావాలన్నారు. కూటమి ప్రభుత్వం ఒక్కపైసా కూడా ఇవ్వడం లేదన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, ఐటీ వింగ్ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, సర్పంచ్ సవర ఆనంద్, మాజీ సర్పంచ్ గంగారావు, నాయకులు సంజీవరావు, కలమట గజపతిరావు, రెడ్డి వెంకటరావు, ఎస్.నీలయ్య, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజిద్దాం

హిరమండలం: మండలంలోని అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై సైన్స్ ఉపాధ్యాయుడు ధనుంజయరావు మంగళవారం అవగాహన కల్పించారు. విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలను చేయించారు. పర్యావరణం పరిరక్షణ దృష్టిలో పెట్టుకుని పాఠశాల తరఫున మట్టి వినాయక ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేశారు.



మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థులు

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

కొత్తూరు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించడంతో 'ఇదేనా స్వచ్ఛత' అనే శీర్షకతో ఈ నెల 25 తేదీన సాక్షిలో కథనం వెలువడింది. ఈ కథనంపై స్థానిక ఈఓపీఆర్డీ వసంతకుమారి స్పందించారు. మండలంలోని నివగాంతోపాటు పలు గ్రామాలను మంగళవారం సందర్శించారు. పారిశుద్ధ్యం లోపించిన గ్రామాల్లో వెంటనే పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలువలు, రోడ్లపై మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. కుళాయిలు, బోర్లు చుట్టూ బ్లీచింగ్ చల్లించాలన్నారు. నివగాం పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి ఉన్నారు.



నివగాంలో మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ వసంతకుమారి

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి

ఆమదాలవలస: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని పలు కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశమయ్యారు. మండపాలు ఏర్పాటు చేసేముందు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తప్పనిసరిగా పోలీసుల అనుమతి పొందాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ స్థలమైతే యజమాని అనుమతి, ప్రభుత్వ స్థలమైతే మున్సిపల్, పంచాయతీ అనుమతి తప్పనిసరనిగా ఉండాలన్నారు. ఫైర్, మున్సిపల్, విద్యుత్ శాఖల అనుమతులు తీసుకుని భద్రతా చర్యలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అగ్నిప్రమాదాలు జరగకుండా విద్యుత్ దీపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని, విగ్రహం ఎత్తు, బరువు ఉత్సవం రోజులు, నిమజ్జన మార్గం వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు, డీజేలను పెట్టకూడదన్నారు. మండపాల వద్ద రాత్రి తప్పనిసరిగా కాపలా ఉండాలని, విగ్రహాల వద్ద డబ్బు, బంగారం ఉంచొద్దన్నారు. రోడ్లపై పందిళ్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. ఊరేగింపులో మత, కుల, రాజకీయ నినాదాలు చేయవద్దన్నారు. అసభ్యకర నృత్యాలు, మద్యం, మత్తు పదార్థాలు పూర్తిగా నిషేధమని తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా డీజేలు, బాణసంచా వాడవద్దని, నిమజ్జన వాహనం సక్రమంగా ఉండాలన్నారు.